సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 30 । నవంబర్ । 2023



టమాట కిలో రూ.24
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.24 పలికింది. కనిష్టం రూ.8.50, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.



'తియ్యటి' ఉపాధి
బేకరీ పదార్థాల తయారీలో 74 ఉడేగోళం గ్రామస్తులది అందెవేసిన చేయి. వందమందికి పైగా దీనిద్వారా ఉపాధి పొందుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.2°/ 19.4°
జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం చలి కొనసాగింది. ఈశాన్యం దిశగా గంటకు 4 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు గోరంట్లకు ఆర్థిక మంత్రుల రాక


ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమంలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ గురువారం గోరంట్లకు విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు సమీక్షించారు. 17 సంక్షేమ పథకాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా పథకాలకు గురించి ప్రజలకు అవగాహన కలిప్పించాలని, ఛాయా చిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆయా పథకాల లబ్ధిదారులతో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రుల ముఖాముఖికి ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీసీహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ స్నాతకోత్సవ నోటిఫికేషన్

- జనవరి మొదటి వారంలో స్నాతకోత్సవం



అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం- అనంతపురం (జేఎన్‌టీయూఏ) 13వ స్నాతకోత్సవం వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో నిర్వహించనున్నారు. స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీల చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అనుమతి లభించడంతో అధికారులు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల్లో బీటెక్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులు స్నాతకోత్సవ పట్టాకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుం రూ.2 వేలు చెల్లించాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక హార్డ్ కాపీలు యూనివర్సిటీకి పంపాల్సిన అవసరం లేదు. పూర్తి వివరాలు www.jntua.ac.in లో పరీక్షల విభాగం కింద తెలుసుకోవచ్చు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాల్లో ఎప్పటికప్పుడు పురోగతి సాధించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో రెండో విడత ఇళ్ల నిర్మాణాల పురోగతిపై స్పెషలాఫీసర్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జగనన్న కాలనీల్లో చేపట్టిన పనులను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి 2024 జనవరి 30వ తేదీ వరకూ ప్రత్యేకంగా 'మెగా కంప్లీషన్ డ్రైవ్' నిర్వహించి ఇప్పటికే ప్రారంభించిన 20,965 ఇళ్ల నిర్మాణాలను పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో అర్హులందరూ పాల్గొనేలా చూడాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎంపీడీఓలు కీలక పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రషీద్‌ఖాన్, మైన్స్ అండ్ జియాలజీ డీడీ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం ప్యాసింజర్ సేవలు పొడిగింపు

గుంతకల్లు: మంత్రాలయం ప్యాసింజర్ సేవలను రానున్న జనవరి ఒకటో తేదీ వరకు పొడిగించినట్లు రైల్వే డివిజనల్ అధికారులు తెలిపారు. నేటితో (30వ తేదీతో) గుంతకల్లు-మంత్రాలయం (07411) డైలీ ప్యాసింజర్ గడువు ముగుస్తోంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రైలును డిసెంబర్ 31 వరకు పొడిగించారు. అదేవిధంగా మంత్రాలయం-గుంతకల్లు (07412) డైలీ ప్యాసింజర్‌ను జనవరి 1 వరకు పొడిగించినట్లు వివరించారు.

జీవాల పెంపకానికి చేయూత

మాంసం ఉత్పత్తి పెంచడంతో పాటు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. రూ. కోటి దాకా బ్యాంకుల నుంచి రుణం ఇప్పించడమే కాకుండా అందులో గరిష్టంగా రూ.50 లక్షల దాకా రాయితీ ఇస్తోంది.



- రూ.కోటి రుణం.. రూ.50 లక్షల సబ్సిడీ
- అన్ని సామాజిక వర్గాల వారూ అర్హులే
- మాంస ఉత్పత్తులు పెంచడంతోపాటు యువతకు ఉపాధి

కదిరి: గొర్రెలు, మేకల పెంపకం దారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహం అందిస్తున్నాయి. మాంసం ఉత్పత్తి పెంచడమే కాకుండా ఉపాధి కోసం ఎదురు చూస్తున్న వారికి ఆదాయం పెంపొందించేందుకు ప్రభుత్వం 'నేషనల్ లైవ్ స్టాక్ మిషన్' (ఎన్ఎల్ఎం) ద్వారా ఓ పథకాన్ని తీసుకొచ్చింది. గొర్రెలు, మేకల పెంపకంపై ఆసక్తి ఉన్న ఎవరైనా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యక్తిగతంగా గానీ, సామూహికంగా గానీ, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, స్వయం సహాయక సంఘాలు ఇలా తమకు ఇష్టమొచ్చిన రీతిలో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో చాలా మందికి ఈ పథకంపై అవగాహన లేక పోవడంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. 2021-22లో ప్రారంభమైన ఈ పథకం 2026-27 ఆర్థిక సంవత్సరం వరకు అమల్లో ఉంటుంది.

యూనిట్ వివరాలు ఇలా
కనిష్టంగా 100 గొర్రెలు, గరిష్టంగా 500 గొర్రెలు లేదా మేకలను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఇందులో ఏ యూనిట్‌కైనా సబ్సిడీ వర్తిస్తుంది. ఇందులో పునరుత్పత్తి కోసం మాత్రమే జీవాలను పెంచాల్సి ఉంటుంది. కేవలం పొట్టేళ్లు లేదా మేక పోతుల పెంపకానికి మాత్రమే అయితే వర్తించదు. సబ్సిడీ విడుదల కావడానికి 2 నెలల నుండి 6 నెలలు పట్టవచ్చు. ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం సబ్సిడీని (గరిష్టంగా రూ.50 లక్షలు) రెండు విడతలుగా మంజూరు చేస్తారు. 500 గొర్రెలు లేదా మేకల యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి దశలో 50 శాతం (రూ.25 లక్షలు), ప్రాజెక్టు చివరి దశలో మిగతా 50 శాతం (రూ.25 లక్షలు) అందజేస్తారు.

ఎంపిక చేసుకునే జీవాలు
గొర్రెలు లేదా మేకల పెంపకానికి అందరూ అర్హులే. ఇందులో కుల, మతాల ప్రస్తావన లేదు. అయితే పశుపోషణపై కొంత అవగాహన ఉండాలి. ఈ పథకం ద్వారా యూనిట్‌ను ప్రారంభిస్తే సాంకేతిక సలహాదారుగా అనుభవజ్ఞులైన పశు వైద్య సిబ్బంది ఒకరిని నియమించుకోవాలి. నూతన సాంకేతిక విధానం ద్వారా జీవాలను పెంచాల్సి ఉంటుంది. ప్రభుత్వం గుర్తించిన 44 గొర్రె జాతులు లేదా 38 మేక జాతుల్లో వేటినైనా ఎంపిక చేసుకోవచ్చు. ఈ విషయం ప్రాజెక్టు రిపోర్టులో తెలియజేయాల్సి ఉంటుంది.

ఎంత భూమి కావాలంటే...
100 నుంచి 500 జీవాల వసతి కోసం అర ఎకరం పొలం ఉండాలి. దీనికి అదనంగా అక్కడే పశు గ్రాసం పెంపకం కోసం 5 నుంచి 10 ఎకరాల భూమి అవసరం. భూమి సొంతం కాకపోయినా లీజుకు తీసుకున్నా సరిపోతుంది. అయితే కచ్చితంగా నీటి వసతి ఉండాలి. ఈ పథకంపై ఆసక్తిగలవారు www.nlm.udyamimitra.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే స్థానిక పశు సంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

గొర్రెలు లేదా మేకల యూనిట్ వివరాలు

యూనిట్	బ్యాంకు రుణం	సబ్సిడీ
500 గొర్రెలు+25 పొట్టేళ్లు (లేదా) 500 మేకలు+25 మేక పోతులు	రూ.కోటి	రూ.50 లక్షలు
400 గొర్రెలు+20 పొట్టేళ్లు (లేదా) 400 మేకలు+ 20 మేక పోతులు	రూ.80 లక్షలు	రూ.40 లక్షలు
300 గొర్రెలు+15 పొట్టేళ్లు (లేదా) 300 మేకలు+ 15 మేక పోతులు	రూ.60 లక్షలు	రూ.30 లక్షలు
200 గొర్రెలు+10 పొట్టేళ్లు (లేదా) 200 మేకలు+10 మేక పోతులు	రూ.40 లక్షలు	రూ.20 లక్షలు
100 గొర్రెలు+5 పొట్టేళ్లు (లేదా) 100 మేకలు+5 మేక పోతులు	రూ.20 లక్షలు	రూ.10 లక్షలు

దరఖాస్తునకు కావాల్సిన డాక్యుమెంట్లు
- డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)
- దరఖాస్తుదారుని ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, అడ్రస్ ప్రూఫ్
- బ్యాంకు అకౌంట్ వివరాలు
- జీవాల పెంపకంపై అనుభవం ఉన్నట్లు స్థానిక పశువైద్యాధికారి నుంచి ధ్రువీకరణ పత్రం
- భూమికి సంబంధించిన పత్రాలు
- గ్రూప్ సభ్యులు కలిసి యూనిట్ ప్రారంభించాలనుకుంటే సభ్యులందరి వివరాలు

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని గ్రామీణ యువతకు, ఔత్సాహిక రైతులకు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా గొర్రెలు, మేకల యూనిట్‌ల నిర్వహణ కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ పథకం ద్వారా ప్రభుత్వం గరిష్టంగా రూ.50 లక్షలు దాకా సబ్సిడీ ఇస్తుంది.
– శుభదాస్, జేడీ, జిల్లా పశుసంవర్ధకశాఖ

సహకారం అందిస్తాం



గొర్రెలు లేదా మేకల యూనిట్ నిర్వహణ కోసం ముందుకొచ్చే గ్రామీణ యువతకు మా వంతు సహకారం అందిస్తాం. దరఖాస్తు చేసుకునే విధానం దగ్గర నుంచి బ్యాంకుల నుంచి రుణం పొందే వరకూ అన్ని విషయాల్లో సహకరిస్తాం. ఈ పథకం ద్వారా ఎంతో లబ్ధి పొందవచ్చు. ఉపాధితో పాటు పెద్ద మొత్తంలో సబ్సిడీ కూడా అందుకోవచ్చు. వివరాలకు 94410 10116 నంబరులో సంప్రదించవచ్చు.
– కోలా వెంకటరమణ, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సభ్యుడు

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం: డిసెంబర్ తొమ్మిదో తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కోరారు. ఉమ్మడి జిల్లాల ఎస్పీలతో బుధవారం ఆయన తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులకు పరిష్కారం చూపాలన్నారు. పోక్సో బాధితులకు పరిహారం అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డి, అనంతపురం ఏఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, సెబ్ అధికారి రామకృష్ణ, శ్రీ సత్యసాయి డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ ఉద్యోగుల వేతనం పెంపు

పుట్టపర్తి: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఒకేసారి రెండింతలకు పైగా జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వారు రిక్రూట్ అయినప్పటి నుంచి రూ.12 వేల వేతనంతో పని చేస్తున్నారు. డిసెంబర్ నుంచి రూ.26,759 వేతనం తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) శ్రీనివాసరావు జారీ చేశారు. దీంతో పాటు 40 పీజీటీ పోస్టుల భర్తీకి చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

నేడు కనకదాస జయంతి

పుట్టపర్తి అర్బన్: ఆధునిక కవి, సంగీతకారుడు, స్వరకర్త కనకదాస జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కనకదాస జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

పారిశ్రామిక ప్రగతికి పట్టం


శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు

- అందుబాటులోకి హిందూపురం, కప్పలబండ ఇండస్ట్రియల్ పార్కులు
- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- హాజరైన కలెక్టర్ అరుణ్‌బాబు, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి
- రెండు పార్కుల్లో వసతుల కల్పనకు రూ.18.86 కోట్లు విడుదల

పుట్టపర్తి అర్బన్: పారిశ్రామిక ప్రగతికి వైఎస్ జగన్ సర్కార్ బాటలు వేస్తోంది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన సౌకర్యాలన్నీ కల్పిస్తూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన పారిశ్రామిక వాడలను బుధవారం తాడేపల్లి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే కొన్ని పారిశ్రామిక వాడల్లో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అందులో భాగంగానే రూ.18.86 కోట్లతో జిల్లాలోని హిందూపురం మండలంలోని పారిశ్రామికవాడ గ్రోత్ సెంటర్, పుట్టపర్తి మండలం కప్పలబండలోని పారిశ్రామిక వాడలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పనులను ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ అరుణ్‌బాబు, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని, జనరల్ మేనేజర్ చాంద్‌బాషా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు ప్రజాప్రతినిధులతో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరించారు.

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి..
పరిశ్రమల స్థాపనతోనే జిల్లా సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టుగోవిందరెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. పారిశ్రామిక వాడల్లో వసతుల కల్పనకు సంబంధించిన పనుల శిలాఫలకాలను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలా ప్రోత్సాహిస్తామన్నారు. ఏపీఐఐసీ భూముల్లో మరిన్ని పరిశ్రమలు స్థాపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హిందూపురం గ్రోత్ సెంటర్ అభివృద్ధికి రూ.7.15 కోట్లు మంజూరు చేశారన్నారు. అక్కడ ఏర్పాటు కానున్న పార్కుకు ఇప్పటికే 741 ఎకరాల సేకరించామన్నారు. పార్కు పూర్తయితే వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. దీంతో పాటు పుట్టపర్తి మండలం కప్పలబండ ఏపీఐఐసీ పార్కుకు 101 ఎకరాలు సేకరించగా, ఇటీవల సుమారు రూ.9 కోట్లు వెచ్చించి 50 ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీ, అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. ఇక తక్కిన 50 ఎకరాల్లో పార్కు అభివృద్ధికి ప్రభుత్వం రూ.11.71 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సిద్ధమవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజీఎం దేవకాంతమ్మ, డిక్కీ సభ్యులు పోలా వెంకటరమణ, మేనేజర్ మల్లికార్జున, పుట్టపర్తి ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని తదితరులు పాల్గొన్నారు.

రేపు పెనుకొండలో 'జగనన్నకు చెబుదాం'

పుట్టపర్తి అర్బన్: 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి కార్యక్రమం డిసెంబర్ 1వ తేదీ (శుక్రవారం) పెనుకొండలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం వారంలో ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే 1వ తేదీ పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. భువన విజయం సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొంటారని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల రూపంలో అందజేస్తే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

7న మడకశిరలో సామాజిక సాధికార బస్సుయాత్ర

మడకశిర: బీసీ, ఎస్సీ, ఎస్టీలకు నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన మేలు వివరించేందుకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర డిసెంబర్ 7న మడకశిరలో కొనసాగుతుందని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీ చరణ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు భారీగా తరలి వచ్చి బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

గ్రామ స్థాయిలోనే పరిష్కారం


జగనన్నకు చెబుదాంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా, మండల స్థాయి అధికారులు

- ప్రజల నుంచి అందే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు

నల్లమాడ: ''చాలా సమస్యలకు స్థానికంగానే పరిష్కారం లభిస్తుంది. కానీ ఎక్కువ మంది ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనకు వచ్చి అర్జీలిస్తున్నారు. స్థానిక అధికారులు సమస్యలు పరిష్కరిస్తే ప్రజలు అంతదూరం వచ్చే అవసరం ఉండదు. ఈమేరకు అందరూ చర్యలు చర్యలు తీసుకోవాలి. గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ఇందులో ఏ ఒక్కరు నిర్లక్ష్యంగా ఉన్నా చర్యలు తప్పవు'' అని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను హెచ్చరించారు. బుధవారం స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో అధ్యక్షతన 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. భూ సమస్యలు, హౌసింగ్ బిల్లులు తదితర సమస్యలపై ప్రజలు మొత్తంగా 138 అర్జీలు అందించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడారు. సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' మండలస్థాయి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత ఉండీ... ప్రభుత్వ పథకాలు అందనివారు వెంటనే సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డీఆర్ఓ కె.కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీసీఓ కృష్ణానాయక్, డీఈఓ మీనాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్ ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డీపీఓ విజయ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ కొండన్న పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని ఇలా..
- తమ తాతముత్తాతలు కొనుగోలు చేసిన 180 ఎకరాల భూమిని తాము దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని పెమనకుంటపల్లి తండా, బాసంవారిపల్లి, కొండ్రవారిపల్లి, అరవవాండ్లపల్లి తండాల రైతులు తెలిపారు. అయితే ఎన్. బడవాండ్లపల్లికి చెందిన ఓ రైతు ఆ భూమిలో తనకూ 70 ఎకరాలు హక్కు ఉందంటూ తమను ఇబ్బంది పెడుతున్నాడని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు.
- నల్లమాడకు చెందిన పారకల వీరాంజనేయులు 15 ఏళ్లుగా చిట్టీలు నిర్వహిస్తూ చాలా మంది వద్ద పెద్ద మొత్తంలో డబ్బు తీసుకొని పరారయ్యాడని మాధవరెడ్డి, షాను ఫిర్యాదు చేశారు. వీరాంజనేయులును పట్టుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కలెక్టర్‌ను కోరారు.

కన్నీటి కావ్యం


భర్త, బిడ్డ మృతదేహాల వద్ద రోదిస్తున్న కావ్య

- ఆర్టీసీ బస్సు ఢీకొని భర్త, కుమార్తె మృతి
- ఇంటిదీపాలు ఆరిపోయి కన్నీరుమున్నీరైన ఇల్లాలు

రొద్దం: మేమిద్దరం మాకిద్దరంటూ ఆ దంపతులు ఆనందంగా గడిపేవారు. అందరూ ఉంటే ఆ ఇల్లు ఆనందకాంతులతో వెలిగిపోయేది. బిడ్డల ముద్దు ముద్దుమాటలు..భర్త ప్రేమానురాగాలతో ఆ ఇల్లాలు ఇంతకంటే ఇంకేమీ వద్దనుకునేది. కానీ ఆమెను చూసి విధికి కన్నుకుట్టింది. ఇంటిదీపాన్నీ, కంటి వెలుగునూ ఒకేసారి ఆర్పేసింది. ఆమె జీవితంలో చిమ్మ చీకట్లను మిగిల్చింది. వివరాల్లోకి వెళితే.. రొద్దం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఫణీంద్రారెడ్డి (35), కావ్య దంపతులు. వీరికి కుమారుడు అఖిల్, కూతురు గౌతమి (4) సంతానం. ఫణీంద్రారెడ్డి 'కియా'లో కార్మికుడిగా పనిచేస్తుండగా, కావ్య పొలం పనులు చేస్తూ జీవనం సాగించేవారు. కూతురు గౌతమికి జ్వరం రావడంతో చిన్నారికి వైద్యం చేయించేందుకు బుధవారం ఉదయం ఫణీంద్రారెడ్డి తన బైక్‌పై సమీపంలోని వెంకటాపురం (కర్ణాటక) బయలుదేరాడు. గ్రామ శివారులోని చెరువుకట్ట వద్దకు చేరగానే హిందూపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఆ ఘటనలో ఫణీంద్రారెడ్డి, చిన్నారి గౌతమి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వలిబాషా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పదినిమిషాల క్రితం 'బాయ్' అంటూ ఆనందంగా చెప్పి వెళ్లిన కూతురు, భర్త నిర్జీవంగా కనిపించడం చూసి కావ్య కన్నీటి పర్యంతమైంది. రక్తపుమడుగులో పడి ఉన్న ఇద్దరినీ ఒడిలోకి తీసుకుని ఆమె రోదించిన తీరు అక్కడున్న వారందరినీ కన్నీరు పెట్టించింది.


గౌతమి, ఫణీంద్రారెడ్డి (ఫైల్)

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే 193 చెరువుల అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు.

భూసేకరణ సత్వరమే పూర్తి చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన భూ సేకరణ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. ఎన్‌హెచ్ 342, ఎన్‌హెచ్ 716జి, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో బుధవారం సాయంత్రం ఆయన సమీక్షించారు. జాతీయ రహదారులకు సంబంధించి సేకరించిన భూమికి సంబంధించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపు వివరాల నివేదిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, నేషనల్ హైవే ఈఈ మధుసూదనరావు, డీఈ గిడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి

పావగడ: తాలూకా పరిధిలోని రాయచర్లు గ్రామానికి చెందిన రైతు గోవిందప్ప(55) పాము కాటుతో మృతి చెందాడు. మంగళవారం రాత్రి తన పొలంలో పంటకు నీరు కడుతున్న సమయంలో పాము కాటు వేసింది. తక్షణమే గోవిందప్పను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటన పై తిరుమణి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తియ్యటి ఉపాధి

- బేకరీ పదార్థాల తయారీలో 'ఉడేగోళం' వాసులది అందె వేసిన చేయి
- ఒకరితో మొదలై నేడు వంద మందికి పైగా ఇదే ఉపాధి
- 'దుర్గం'లో మెజార్టీ బేకరీలు వారివే
- ఇతర ప్రాంతాల్లోనూ నిర్వహణ

గ్రామం	74 ఉడేగోళం
మండలం	రాయదుర్గం
కుటుంబాలు	961





కర్ణాటకలోని జిందాల్ వద్ద బేకరీ నిర్వహిస్తున్న ప్రవీణ్



సాక్షి, అనంతపురం డెస్క్: వ్యవసాయమే వారికి జీవనాధారం. వివిధ పంటలు పండిస్తూ మంచి లాభాలు ఆర్జించేవారు. సాఫీగా సాగుతున్న వారి బతుకులను సరిగ్గా పాతికేళ్ల క్రితం కరువు ఛిద్రం చేసింది. వ్యవసాయ బోర్లలో నీళ్లు ఇంకిపోయాయి. పంటలన్నీ ఎండిపోయాయి. బతుకు భారమైంది. చేసేది లేక మూటాముల్లె సర్దుకుని వలస బాట పట్టారు. ఈ పరిస్థితులే వారిని కొత్త రంగానికి పరిచయం చేశాయి. నేడు బేకరీ పదార్థాల తయారీ, నిర్వహణలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఏపీ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో సొంత బేకరీల ఏర్పాటుతో పాటు వర్కర్లుగానూ పనిచేస్తూ 'తియ్యటి' ఉపాధి పొందుతున్నారు. తద్వారా ఆర్థికంగానూ ఎదుగుతున్నారు. వారే రాయదుర్గం మండలం 74 ఉడేగోళం వాసులు.

ఒక్కడితో మొదలై..

తొలుత 74 ఉడేగోళం గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు మహారాష్ట్రకు వలస వెళ్లాడు. అక్కడ ఓ బేకరీలో చేరి పొట్టపోసుకున్నాడు. పని నేర్చుకున్నాక కర్ణాటకలోని బళ్లారి జిల్లా జిందాల్ వద్ద బేకరీలో వర్కర్‌గా చేరాడు. చివరకు ఆ బేకరీకే ఓనర్‌గా ఎదిగాడు. అక్కడ మొదలైన మార్పు గ్రామంలోని చాలామంది యువతకు మార్గనిర్దేశకమైంది. అతణ్ని ఆదర్శంగా తీసుకున్న పలువురు యువకులు ఆ రంగం వైపు దృష్టి మళ్లించారు. ప్రవీణ్ రాయదుర్గం పట్టణంలోని తేరుబజారులో తన బంధువుతో 20 ఏళ్ల క్రితం ఓ బేకరీ తెరిపించాడు. అలా మొదలై ఒకటి వెంట ఒకటి వెలుస్తూ నేడు పట్టణంలో బేకరీల సంఖ్య 15కు చేరింది. రాయదుర్గంలో ఏవీధికెళ్లినా ఉడేగోళం వాసుల బేకరీలే ఉండడం గమనార్హం. అలాగే కర్ణాటకలోని జిందాల్, తోరణగల్లు, బళ్లారి, చెళ్లకెర, చిత్రదుర్గం, రాష్ట్రంలోని కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాల్లో బేకరీల ఏర్పాటుతో పాటు వర్కర్లగానూ పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

వంద మందికి పైగా..

74 ఉడేగోళం గ్రామంలో వంద మందికి పైగా బేకరీలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కొందరు సొంత బేకరీలు ఏర్పాటు చేసుకోగా..మరికొందరు స్వీట్ల తయారీ మాస్టర్లుగా రాణిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలకు చెందిన యువకులు సైతం వీరి వద్ద స్వీట్ల తయారీలో శిక్షణ తీసుకుంటుండడం గమనార్హం. ట్రెండ్స్‌కు తగ్గట్టుగా పలు రకాల స్వీట్లు, బిస్కెట్లు, కేక్‌ల తయారీలో ఉడేగోళం వాసులది అందె వేసిన చేయి. దిల్ పసంద్ అంటేనే రాయదుర్గం గుర్తొచ్చేలా నైపుణ్యత సాధించారు.

ప్రవీణ్‌ను ఆదర్శంగా తీసుకున్నాం



రాయదుర్గం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో 12 ఏళ్లుగా బేకరీ నిర్వహిస్తున్నా. స్థానికంగానే ఉపాధి పొందుతూ మరి కొంత మంది యువతకు కూడా ఉపాధి కల్పించా. ఇది మా గ్రామానికి చెందిన ప్రవీణ్ వల్లే సాధ్యమైంది.
– పృథ్వీ, బేకరీ నిర్వాహకుడు, 74 ఉడేగోళం

బేకరీలే మమ్మల్ని ఆదుకున్నాయి



వ్యవసాయంలో వస్తున్న నష్టాలు, కష్టాలు భరించలేక పదేళ్ల క్రితం భర్త నాగరాజుతో కలసి బేకరీ వ్యాపారం చేపట్టాం. రాయదుర్గం లక్ష్మీబజార్‌లోని అనంతపురం బస్టాప్ వద్ద బేకరీ ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. పలు రకాల స్వీట్లు, బిస్కెట్లను మేమే తయారుచేస్తాం.
– వినూత, బేకరీ నిర్వాహకురాలు, 74 ఉడేగోళం

శ్రమకు తగ్గ ప్రతిఫలం



నా ఒక్కడితో మొదలైన ఈ వ్యాపారం ఎన్నో కుటుంబాలకు మేలు చేసింది. చాలా మంది ఈ రంగాన్ని ఎంపిక చేసుకుని నా కంటే బాగా రాణిస్తుండడం సంతోషాన్నిస్తోంది. ఈ రంగం వైపు ఎవరు వస్తామన్నా ప్రోత్సహిస్తున్నాం. వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం.
– ప్రవీణ్, బేకరీ నిర్వాహకుడు, జిందాల్

దుర్గంలో మాదే మొదటి బేకరీ

వ్యవసాయంలో నష్టాల తర్వాత బేకరీ వైపు అడుగులు వేశాను. ప్రవీణ్ ప్రోత్సాహంతో రాయదుర్గంలో తొలి బేకరీ నేనే నెలకొల్పాను. ఆ తర్వాత మా గ్రామం నుంచి చాలా మంది పట్టణంలో బేకరీ వ్యాపారం చేపట్టారు. అందరూ విజయవంతమయ్యారు.
– ఉమేష్, 74 ఉడేగోళం

'108'లో ప్రసవం



శిశువును అందజేస్తున్న ఈఎంటీ బాబా ఫక్రుద్దీన్

హిందూపురం అర్బన్: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు.. గోరంట్ల మండలం పాలసముద్రానికి చెందిన గర్భిణి అరుణకు బుధవారం వేకువజామున పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని ఆమెను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేపట్టారు. మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పైలెట్ ఫరీద్ అహమ్మద్ సాయంతో ఆమెకు ఈఎంటీ బాబా ఫక్రుద్దీన్ కాన్పు చేశారు. పండంటి మగబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రికి చేర్చగా.. పరీక్షించిన వైద్యులు వారు ఆరోగ్యంగా ఉన్నారని నిర్ధారించారు.

మైనర్‌కు పెళ్లి!

- భర్త లేని సమయాల్లో బలాత్కరించబోయిన మామ
- వేధింపులు తాళలేక పుట్టింటికి చేరిన బాలిక
- జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు



బాలికను వివాహం చేసుకున్న హరికృష్ణ (ఫైల్)

అనంతపురం క్రైం: పేదరికం, తల్లి అనారోగ్యం కారణాలను ఆసరాగా చేసుకున్న దుర్మార్గులు ఓ బాలికను పోరంబోకుకు కట్టబెట్టారు. తండ్రి స్థానంలో ఉన్న మామ బలాత్కరించబోగా తప్పించుకుని బయటపడిన బాలిక నేరుగా తల్లి చెంతకు చేరింది. జరిగిన అన్యాయంపై పోలీసులను ఆశ్రయించింది. వివరాలు... అనంతపురం నగర శివారులోని ఓ కాలనీకి చెందిన బాలిక తండ్రి చిన్నప్పుడే మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి కూలి పనులు చేస్తూ ఏడో తరగతి వరకూ చదివించింది. ఈ క్రమంలోనే ఆమె అనారోగ్యం బారిన పడింది. ఇల్లు గడవడం కష్టంగా మారింది. దీంతో ఆ కుటుంబంపై పెళ్లిళ్ల పేరయ్య చాకలి చౌడప్ప కన్నేశాడు. వరుడి తరఫున పెద్ద ఎత్తున కమీషన్ దండుకుని తల్లి చనిపోతే బిడ్డ భవిష్యత్తు ఏమిటంటూ ఆమెను భయపెట్టాడు. బాలికకు పెళ్లి చేసేస్తే ఓ పనైపోతుందని నచ్చ చెప్పాడు. ఈ క్రమంలోనే కంబదూరు మండలం, పాళ్లూరుకు చెందిన మరో కులానికి చెందిన యువకుడు హరికృష్ణ, కుటుంబసభ్యులను పిలిపించి పెళ్లి చూపులు సిద్ధం చేయించాడు. తనకు ఇప్పుడే పెళ్లి వద్దని చెప్పిన బాలికను దబాయించారు. నోరు మూసుకుని పెళ్లికి ఒప్పుకోవాలని, నీ తల్లి చనిపోతే చూసే దిక్కు కూడా ఉండదని భయపెట్టారు. పెళ్లికొడుక్కి హిందూపురంలో ఓ పెట్రోలు బంకు, 15 ఎకరాల భూమి, రూ.కోట్లలో డబ్బుందని నమ్మించి ఆగస్టు 27న పాపంపేటలోని రామాలయంలో పెళ్లి జరిపించేశారు. పెళ్లి సమయంలో అనుమానాలు వ్యక్తం చేసిన వారికి అప్పటికి బాలిక వయసు13 ఏళ్లు కాగా, 19 ఏళ్లుగా మార్చేసిన ఆధార్ కార్డును చూపించి మభ్య పెట్టారు. పెళ్లి సమయంలో తన వద్ద ఉన్న బంగారు ఉంగరాన్ని హరికృష్ణకు బాలిక తల్లి అప్పగిస్తూ బిడ్డను కాపురానికి పంపింది. హిందూపురంలో తనదిగా చెప్పుకున్న పెట్రోలు బంకులోనే హరికృష్ణ కాపురం పెట్టాడు. భార్య కనీస అవసరాలు పట్టించుకోకుండా వేధించేవాడు. భర్త లేని సమయాల్లో మామ బాలికతో అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఈ విషయాన్ని బాలిక అత్తతో చెప్పిన పాపానికి మెడలో వేసిన బంగారు గొలుసు లాక్కొని నల్లపూసల తాడు వేశారు. ఈ విషయాన్ని ఎక్కడా చెప్పకూడదని బెదిరించారు. తనను చూసేందుకు వచ్చిన తల్లితో జరిగిన విషయాలను బాలిక బయటపెట్టింది. దీంతో ఆమె నిలదీయడంతో కుటుంబసభ్యులంతా దాడి చేయబోయారు. వారి బారి నుంచి తప్పించుకున్న ఆమె చివరకు తన బిడ్డను పిలుచుకుని అనంతపురానికి చేరుకుంది. పెళ్లిళ్ల పేరయ్యతో పాటు పెళ్లికి పెద్ద మనుషులుగా వ్యవహరించిన వారికి జరిగిన విషయం తెలిపి తన బిడ్డ జీవితాన్ని నాశనం చేశారని కన్నీరు మున్నీరైంది. దీనిపై హరికృష్ణను పెద్దలు నిలదీస్తే దుర్భాషలాడుతూ ఫోన్ కట్ చేసినట్లు సమాచారం. దీంతో జరిగిన మోసంపై బుధవారం ఉదయం నాల్గో పట్టణ పోలీసులకు తల్లి, బాలిక ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జనవాక్కు

మా నమ్మకం జగనే



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పైనే మాకు నమ్మకముంది. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మా కుటుంబానికి రూ.3 లక్షలకు పైగా లబ్ధి చేకూరింది. వైఎస్సార్ చేయూత కింద మూడు విడతల్లో రూ.55,250, వైఎస్సార్ ఆసరా ద్వారా ఏడాదికి రూ.6 వేలు చొప్పున రూ.18 వేలు నా బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. అంతేకాక నా కోడలికి అమ్మ ఒడి పథకం, నా భర్తకు నెలకు రూ.2,750 పింఛన్ అందుతోంది. ప్రభుత్వ సహకారంతో ఆర్థికంగా మేము నిలదొక్కుకున్నాం. సీఎంగా వైఎస్ జగన్ మరో పది కాలాల పాటు ఉండాలని కోరుకుంటున్నా.
–నరసమ్మ, కల్లూరు, లేపాక్షి మండలం

సొంతింటి కల నెరవేరింది



జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మా సొంతింటి కల నెరవేరింది. గతంలో సొంతిల్లు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. టోల్ గేట్ వద్ద నాకు ఇచ్చిన స్థలం విలువ ఇప్పుడు రూ. లక్షల్లో ఉంది. నన్ను లక్షాధికారిని చేసిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.
– భాగ్యమ్మ, బిసలమానేపల్లి, లేపాక్షి మండలం

పెట్టుబడి సాయంతో ఊరట



మాది మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. మూడు ఎకరాల పొలం ఉంది. పంటల సాగు ద్వారా వచ్చే ఆదాయం ఖర్చులకే సరిపోయేది. తిరిగి పంట పెట్టే సమయానికి పెట్టుబడులు, విత్తన సమస్యతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మా కష్టాలు తీరాయి. పంట సాగుకు ముందే పెట్టుబడి సాయం కింద రూ.13,500 అందిస్తున్నారు. ఇప్పటి వరకూ రూ.54 వేల మేర లబ్ధి చేకూరింది. ఈ మొత్తంతో వ్యవసాయం సులువైంది. అంతేకాక మా ఊళ్లోనే విత్తనాలు, ఎరువులూ అందజేస్తున్నారు. దీంతో అప్పు చేయకుండా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకున్నాం.
– ఈశ్వరరెడ్డి, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

బిడ్డను చదివించుకుంటున్నాం



నాకు బార్బర్ షాప్ ఉంది. షాప్ ద్వారా ఆదాయం అంతంత మాత్రమే ఉండేది. పదో తరగతి చదువుతున్న మా కుమార్తెను మంచి దుస్తులు, పుస్తకాలు కొనడానికీ ఇబ్బంది పడ్డాం. ఇక పెద్ద చదువులు చదివించాలంటే మా వల్ల కాదనుకుని పదో తరగతి తర్వాత చదువు మాన్పించేద్దామనుకున్నాం. ఈ పరిస్థితుల్లో ఉన్నప్పుడే సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్నారు. అమ్మఒడి, చేదోడు, ఆసరా తదితర పథకాల లబ్ధితో ఆర్థిక ఇబ్బందులు తీరాయి. మా బిడ్డ ఉన్నత చదువులకు మార్గం ఏర్పడింది. సీఎం వైఎస్ జగన్ చలువతోనే ఇదంతా సాధ్యమైంది. ఆయనే ముఖ్యమంత్రిగా మరో పది కాలాల పాటు ఉండాలి.
– శివకుమార్, మధూడి గ్రామం, అగళి మండలం

వ్యక్తి దుర్మరణం

అమడగూరు: టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలం కుమ్మరోళ్లపల్లికి చెందిన వల్లిపి శివన్న (56) తన బంధువుల ఇంట జరుగుతున్న శుభకార్యానికి అవసరమైన కూరగాయలను బుధవారం ఉదయం కర్ణాటక ప్రాంతం దిబ్బూరపల్లిలో కొనుగోలు చేసుకుని ద్విచక్రవాహనంపై సొంతూరుకు బయలుదేరాడు. అమడగూరు మండలం మలకవారిపల్లి తండా సమీపంలోకి చేరుకోగానే మలుపు వద్ద ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీ కొనడంతో శివన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ బలరామయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి



మృతుడు నారాయణ

ధర్మవరం రూరల్: మండలంలోని రేగాటిపల్లికి చెందిన నారాయణ(60) బుధవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తన ఇంటి వద్ద కరెంట్ మోటారు ద్వారా నీళ్లు పట్టేందుకు సిద్ధమైన ఆయన ఇనుప గేటు పట్టుకుని విద్యుత్ వైర్లు మారుస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్య



మృతురాలు రూప

కనగానపల్లి: కడుపు నొప్పి తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం పాతపాళ్యం కొత్తూరుకు చెందిన లక్ష్మీరెడ్డి, జ్యోతి దంపతుల కుమార్తె రూప (23) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఇటీవల కడుపు నొప్పి తీవ్రం కావడంతో ఇంటికి చేరుకున్న ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె బుధవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కనగానపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అది బల్లి కాదు



మందు బాటిల్‌లోని అవశేషాలు

సోమందేపల్లి: స్థానికంగా ఓ బ్రాందీ షాప్‌లో కొనుగోలు చేసిన మద్యం బాటిల్‌లో చనిపోయిన బల్లి ఉన్నట్లుగా బుధవారం ఉదయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అప్రమత్తమైన ఎక్సైజ్ ఎస్‌ఐ నారాయణ వెంటనే సదరు బాటిల్ స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అయితే అందులో ఉన్నది బల్లి కాదని, ప్యాకింగ్ సమయంలో చెత్త అవశేషాలు (సెడిమెంట్) పడినట్లుగా నిర్ధారించారు.

హోరాహోరీగా వృషభాల బలప్రదర్శన



రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

బొమ్మనహాళ్: గజగౌరీ ఉత్సవాల్లో భాగంగా బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన హోరాహోరీగా సాగింది. పోటీలను ఎంపీ తలారి రంగయ్య ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు 10 జతల వృషభాలను పోటీలకు తీసుకువచ్చారు. బెళుగుప్ప మండలం గంగవరానికి చెందిన రైతు వెంకటేష్ వృషభాలు 6 వేల అడుగుల దూరం దూలాన్ని లాగి మొదటి బహుమతిని గెలుచుకున్నాయి. అలాగే ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామ రైతు చెన్నప్ప వృషభాలు 5,971 అడుగుల దూరం లాగి రెండో బహుమతి, కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి రైతు నీరుగంటి నాగరాజు వృషభాలు 5,079.3 అడుగుల దూరం లాగి మూడో బహుమతి, రాయదుర్గం రైతు బంగి క్రిష్ణయ్య వృషభాలు 4,808.9 అడుగుల దూరం లాగి నాల్గో బహుమతి గెలుచుకున్నాయి.

రాష్ట్ర మహాసభ జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: విజయవాడ వేదికగా డిసెంబర్ 10న జరిగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ మైనుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పుట్టపర్తిలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మధునాయక్, గంగాద్రి, రమేష్, రమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై కత్తితో దాడి

తాడిపత్రి: ఓ ఇంట్లో చొరబడిన దుండగుడు కత్తితో దంపతులపై దాడి చేసి ఉడాయించాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వివాహిత చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని కాలువగడ్డ వీధిలో నివాసముంటున్న రమాదేవి బుధవారం తెల్లవారుజామున ముంగిట ముగ్గు వేసి ఇంట్లోకి వెళుతున్న సమయంలో వెనువెంటనే ఓ దుండగుడు చొరబడ్డాడు. విషయాన్ని గమనించని ఆమె వంట గదిలోకి వెళ్లగానే రమాదేవి నోరు నొక్కిపెట్టి తన వెంట తీసుకెళ్లిన కత్తితో గొంతు కోశాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఆమె భర్త, విశ్రాంత సైనికోద్యోగి వెంకట్రామిరెడ్డి అడ్డుకోవడంతో రమాదేవిని పక్కకు తోసి, వెంకట్రామిరెడ్డి పొట్టలో పొడిచి ఉడాయించాడు. సమాచారం అందుకున్న బంధువులు వెంటనే అక్కడకు చేరుకుని క్షతగాత్రులను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కాగా, ఆగంతకుడు ఎలాంటి వస్తువులను చోరీ చేయలేదు. ఘటనపై సీఐ హమీద్‌ఖాన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

3న జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ హ్యాండ్ బాల్ పోటీలు

బత్తలపల్లి: జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగాల్లో హ్యాండ్ బాల్ పోటీలను డిసెంబర్ 3న నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి సాకే శివశంకర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు ఉంటాయి. 2008, జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని గుంటూరులోని తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారు. పూర్తి వివరాలకు 89781 37522, 70135 72439లో సంప్రదించవచ్చు.